# ఏడవ ప్రసంగము

తరువాతిరోజున అందరు నిత్యానందస్వామివారివద్ద కూర్చొని ఉండిరి. అక్కడకు దర్బారునుండి టీ, పాలు, మిఠాయిలు మొదలగు అనేక తినుబండారములు పంపబడెను. ఆ తీసికొనివచ్చినవారితో శ్రీప్రకాశానందస్వామివారు ఇట్లనిరి. "ఈ మిఠాయిలు నాకేమి నచ్చవు."

బేచరభాయి:-మిఠాయిలు తినుటకు తమకు ఏమి అభ్యంతరము కలదు?

స్వా॥ ప్ర:-అవును. అభ్యంతరమే. ఈప్రసంగమున ఒక మహమ్మదీయ సత్పురుషుని దృష్టాంతము వినండి. ఆయన పేరు 'మలిక్ దినార్'. ఆయన చాలకాలము మృష్టాన్నభోజనము చేసెడివాడు కాడు. ప్రతిరోజు సాయంకాలము రొట్టెల దుకాణమునకు వెళ్ళి ఒకరొట్టె కొని తెచ్చెడివాడు. అది తిని నీళ్ళుత్రాగి ఆరోజు ఉపవాసభంగము చేసెడివాడు. అతడు ఎంతో ఆరోగ్యముగానుండెడివాడు. ఒకమారు అజ్ఞానముచే అతనికి పిండివంటలు తినవలెనను కోరిక కలిగెను. ఎన్నియో దినములు తనను తాను నివారించుకొనెను. అయినను ఆశ అతనిని వెంటాడుట మానలేదు. అంతట ఒకరోజున ఆతడు బజారునకు వెళ్లి మిఠాయిలు కొనుక్కొని ఇంటికి వచ్చెను. మహాత్ముడగు మలిక్ దినారు ఆమిఠాయిలు ఏమి చేయునో చూడవలెనను ఉద్దేశ్యము దుకాణపు యజమానికి కలిగెను. ఆతడు ఒకనిని మలిక్ దినారు వెనుక పంపెను. కొంచెము దూరము వెళ్లిన తరువాత మలిక్ దినారు మిఠాయిలు బట్టలోనుంచి బయటకు తీసి మూడుమారులు వాసనచూచి ఇట్లు చెప్పెను:

"ఓ మానసమా, నీకు ఈమాత్రము భోగము చాలును."
అంతట ఆతడు ఆమితాయిలు ఒక భిక్షుకునకు ఇచ్చి మనస్సునకు ఇట్లు ఉపదేశించెను:—

"ఓ బలహీనమగు మానసమా! నియమానుసారము నడచుకొనుటకు నేను నిన్ను బాధించ దలచియున్నాను. నాకు నీయందు ద్వేషము లేదు. నిన్ను మిత్రునిగా తలచుటచేతనే ఇట్లు చేసితిని. కొద్దిరోజులు ఓపిక పట్టుము. ఏదో ఒకరోజున నీదుఃఖములు అన్నియు తప్పక నశించును. నాశనములేని సుఖము కలుగును."

## సాత్త్విక పదార్థములు.

బేచరభాయి:—పులుపు, ఉప్పు, కారము మొదలగు రాజస పదార్థములు తినరాదనియే గీతలో చెప్పిరి. పాలు, నెయ్యి మొదలగునవి సాత్త్విక పదార్థములు.

ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః ।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః॥

"ఆయుర్దాయము, శక్తి, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతి పెంపొందించునవియు, రుచికలవియు, నేతితో చేసినవియు, పాడు కానివియు,ఆనందకరములును అగు ఆహారములు సాత్త్వికస్వభావము కలవారికి ఇష్టము."

## యోగాభ్యాసము చేయువారికి సాత్త్వికాహారము నిషిద్ధము.

స్వా॥ ప్రి॥ :—సాత్త్విక పదార్థములని ఇప్పటి సన్యాసులు లడ్డూలు, జిలేబీలు మొదలగునవి ఆరగిస్తూంటారు. గృహస్థాశ్రమమునందున్నవారికి ఇవన్నియు సాత్త్వికపదార్థములే కాని, యోగాభ్యాసము చేయువారికి ఇవి అన్నియు నిషిద్ధములే. భర్తృహరి మహారాజు మాటలు వినండి.

విశ్వామిత్రపరాశర ప్రభృతయో వాతామ్బుపర్ణాశనాః
తేఽపి స్త్రీముఖపఙ్కజం సులలితం దృష్ట్వైవ మోహం గతాః।

శాల్యన్నం సఘృతం పయోదధియుతం భుఞ్జన్తి యే మానవాః
తేషామిన్ద్రియనిగ్రహో యది భవేద్వింధ్యస్తరేత్సాగరమ్॥

"విశ్వామిత్రుడు, పరాశరుడు మొదలగు మహర్షులు గాలి, నీరు, ఆకులు తినెడివారు. వారుకూడ సుందరమగు కాంతాముఖమును చూచినంతమాత్రమున మోహమును పొందిరి. ఇక నెయ్యి, పాలు, పెరుగులతో అన్నము తినెడివారికి ఇంద్రియనిగ్రహము ఎట్లు కలుగును? అట్లు కలిగినచో వింధ్యపర్వతము సముద్రముపై తేలకలదు." అనగా ఇది అసంభవము.

## యోగుల ఆహారము.

ఖేచరభాయి :—అయితే యోగులు అందరు ఆకులు, అలము తినవలెనా ?

స్వా॥ ప్ర॥ :-ఆకులు అలము తినవలెనని శాస్త్రములో లేదు. కాని యోగాభ్యాసమునకు తగిన ఆహారము భుజించవలెను. మహాభారతములో ధర్మరాజు భీష్మపితామహుని యోగుల ఆహారము గురించి అడుగగా ఆయన ఇట్లు చెప్పెను :-

కణానాం భక్షణే యుక్తః పిణ్యాకస్యచ భారత ।
స్నేహానాం వర్జనే యుక్తో యోగీ బలమవాప్నుయాత్॥

"నెయ్యి, నూనె, మొదలగు బలవర్ధక పదార్థములను విసర్జించి యోగి ధాన్యాదికణములను, గానుగపిండిని భుజించవలెను. అప్పుడే ఆతనికి ఆత్మబలము కలుగును."

భుఞ్జానో యావకం రూక్షం దీర్ఘకాల మరిన్దమ ।
ఏకాహారో విశుద్ధాత్మా యోగీ బలమవాప్నుయాత్॥

"రుచిలేని యవధాన్యమును ఏకభుక్తముగా భుజించుచు చాల కాలము గడుపువాడు పరిశుద్ధమైన అంతఃకరణమును పొంది ఆత్మబలమును సంపాదించగలడు."

## భోగములచే చిత్తవృత్తులకు ఏకాగ్రత కలుగదు.

ఇతరగ్రంథములయందు కూడ ఇటులనే ప్రాణరక్షణార్థమును, చిత్తైకాగ్రిత కొరకును అనేకరకములగు ఆహారములు వ్రాయబడినవి. అవితప్ప మిగిలినవి భోగపదార్థములని చెప్పబడినవి. భోగము, యోగము రెండును ఒకదానికొకటి విరుద్ధములు.

బేచరభాయి :—తమంతట తాము తినరాదు. కాని, ఇతరులు ప్రార్థించినప్పుడు తినినచో దోషమేమి?

స్వా॥ ప్రి॥ :—త్రిదోషములు ప్రకోపించి తీవ్రజ్వరముతో బాధపడుచున్నవాడు ఒకప్పుడు పెరుగును అడిగినంతమాత్రమున ఆప్యాయముగా తెచ్చి, వానిని బలవంతముచేసి దానిని తినిపించిన వాని రోగము ముదురునే కాని కుదురునా? అట్లే ఇతరులు ఇబ్బంది పెట్టినందున భోగములకు ఆశపడి తినినవానికి చిత్తైకాగ్రిత కుదరదు.

విషయభోగములయందును నిమగ్నులయినవారి మనస్సు కామ్యములవైపు మొగ్గును. వారి మనస్సు అనేకవ్యావృత్తులయందు మునిగిపోవును. పరమాత్మప్రాప్తిని కలిగించు సమాధిని పొందదు. ఆత్మానుసంధానముచేయు శక్తి ఉండదు.

## భోగములు ఎన్ని?

*సుగన్ధి వనితా వస్త్రం గీతం పానం చ భోజనమ్।*
*శయ్యా చ భూషణం జ్ఞేయో భోగోఽష్టవిధో బుధైః॥*

సెంట్లు, అత్తరులు, పువ్వులు, మొదలగు సుగంధద్రవ్యములు, స్త్రీలు, వస్త్రములు, సంగీతము, పానము, భోజనము, పాన్పు, అలంకారములు— అని భోగములు ఎనిమిది రకములు.

శివసంహితలోకూడ ఇట్లున్నది :—

*నారీ శయ్యాసనం వస్త్రం ధనమస్య విఘ్నకమ్।*
*తామ్బూలభక్షయానాని రాజ్యైశ్వర్యవిభూతయః॥*
*హేమం రౌప్యం తథా తామ్రం రత్నం చాగరుధేనవః।*
*పాణ్డిత్యం వేదశాస్త్రాణాం నృత్యం గీతం విభూషణమ్॥*
*వంశీ వీణా మృదఙ్గాశ్చ గజేన్ద్రశ్చాశ్వవాహనమ్॥*
*దారాపత్యాని విషయా విఘ్నా ఏతే ప్రకీర్తితాః॥*

"ముముక్షువునకు స్త్రీసంపర్కము, శయ్య, ఉత్తమాసనము, వస్త్రములు, ధనాదులు విఘ్నకరములు. తాంబూలభక్షణము, వాహనములు, రాజ్యము, ఐశ్వర్యము, వివిధభోగములు, బంగారము, వెండి, రాగి, విలువగల రత్నములు, అగరు, పశుధనము, ఏనుగు, గుఱ్ఱము, పల్లకి, వేదశాస్త్రములందు పాండిత్యము, నృత్యము గీతము, అలంకారము, వేణువాద్యము, వీణ, మద్దెల, భార్య, బిడ్డలు —ఈవిషయములన్నియు విఘ్నములే."

## ఐశ్వర్యముచే చిత్తైకాగ్రతకు భంగము.

భోగములను అనుభవించుటచే చిత్తైకాగ్రతకు భంగము కలుగునట్లుగనే, ఐశ్వర్యము అనగా అధికారముచే ఏకాగ్రతకు భంగము కలుగును. ఐశ్వర్యమనగా రాజ్యాధిపత్యము, దాసదాసీజనములు, ఏనుగులు, గుర్రములు మొదలగువానియందు ఆధిపత్యము, ఈ ఐశ్వర్యము ఆత్మసాక్షాత్కారమునకు విరోధి. ఇందువలననే ముముక్షువు ఐహికములు, పారలౌకికములు అను రెండువిధముల భోగములను, ఐశ్వర్యములను కూడ వాంఛించడు. యమధర్మరాజు ప్రలోభమునకు నిర్దేశించిన భోగాదులను ఆశింపక నచికేతుడు ఆత్మసాక్షాత్కారమునకు బ్రహ్మవిద్యనే కోరెను.

నచికేతుని తండ్రి వట్టిపోయిన ఆవులను యజ్ఞములో దానము చేసెను. అప్పుడు నచికేతుడు చాల చిన్నవాడు. అతడు శ్రద్ధాభక్తులతో తండ్రిని అడిగెను. నాన్నగారూ! మీరు వట్టిపోయిన ఆవులను బ్రాహ్మణులకు దానము చేసినారు. నన్ను ఎవరికి ఇచ్చెదరు అని పలుమార్లు అడిగెను. తండ్రి కోపోద్రిక్తుడై 'యమునకు' అని సమాధానము చెప్పెను. పితృవాక్యపాలకుడగు నచికేతుడు యమలోకమునకు వెళ్లెను. యముడు ఆసమయమున ఇంట లేడు. యముని భార్య స్నాన సంధ్యాదులుచేసి దేవతార్చనకు లెమ్మని నచికేతుని కోరెను. కాని, యముని దర్శనము చేయువరకు ఏమియు గ్రహించను అని నచికేతుడు చెప్పెను. అట్లు యమసదనమున నచికేతుడు మూడురోజులు నిరాహారముగా పడిఉండెను. ఇంటికివచ్చి యముడు నచికేతుని చూచి ఇట్లనెను. "నాయనా, నచికేతా, నీవు మా అతిథివి. మూడు రోజులనుండి నిరాహారముతో నుంటివి. నీయందు ప్రసన్నుడ నయితిని. మూడు వరములను కోరుకొనుము. నచికేతుడు పలికెను:—మా తండ్రి గారు నాయందు కోపముతో ఉన్నారు. వారికోపము శాంతించి ప్రసన్నులగునట్లు మొదటివరమును దయచేయుడు. యముడు 'తథాస్తు' అనెను. స్వర్గమును పొందుటకు కారణమగు యజ్ఞము ఎట్లు చేయవలెను? అందు ఎన్ని ఇటికలను ఎట్లు ఉపయోగించవలెను? ఈ యజ్ఞవిద్యావిషయములను రెండవవరముగా ప్రసాదింపుడు అని నచికేతుడు పలికెను. యముడు యజ్ఞవిద్యను నచికేతునకు నేర్పి ఇట్లనెను. ప్రపంచమున ఈవిద్య నీపేరున విఖ్యాతిని చెందును. నీవు మూడవవరము కోరుము. నచికేతుడు అడిగెను:— "మరణానంతరము ఆత్మ పొందుస్థితిని నాకు తెలుపుము. ఇది నేను కోరు మూడవవరము. నాకు ఆత్మవిద్య నేర్పుడు." యముడు పలికెను. "దేవతలు కూడ ఈవిషయమును తెలిసికొనగోరుదురు. ఇది చాల రహస్యము. దుర్లభము. ఆవిషయమును అడుగకుము" నచికేతుడు ఇట్లనెను:— "తమరు

సెలవు ఇచ్చినట్లు ఈవిషయము కడు దుర్లభము. దేవతలకుకూడ ఇది తెలిసికొనవలెనని కోరిక ఉండును. కనుక ఇప్పుడు నేను వేరొక వరము ఏలకోరుదును? ఆత్మవిద్యనే కోరుచున్నాను.” నచికేతుని సమాధానము విని యముడు చెప్పెను:—

*శతాయుషః పుత్రపౌత్రాన్వృణీష్వ బహూన్పశూన్ హస్తిహిరణ్యమశ్వాన్।*
*భూమేర్మహదాయతనం వృణీష్వ స్వయంచ జీవ శరదో యావదిచ్ఛసి॥*

“నూరుసంవత్సరములు ఆయుర్దాయము కల పుత్రులను, పౌత్రులను కోరుము. అనేకములగు పశువులను, ఏనుగులను, సువర్ణమును, గుర్రములను, నివాసమునకు పెద్ద భూభాగమును కోరుము. నీ ఇష్టమువచ్చినంతకాలము జీవించుము.”

*ఏతత్తుల్యం యది మన్యసే వరం వృణీష్వ విత్తం చిరజీవికాం చ।*
*మహాభూమౌ నచికేతస్త్వమేధి కామానాం త్వా కామభాజం కరోమి॥*

“ఇట్టివరము మరియొకటి నీకు తోచినచో కోరుకొనుము. ధనమును, చిరజీవిత్వమును కోరుకొనుము. ఈమహాభూమియందు వర్ధిల్లుము. నీకు కావలసిన కోరికలను ఇష్టమువచ్చినట్లు అనుభవించువానినిగా చేయుదును.”

*యే యే కామా దుర్లభా మర్త్యలోకే సర్వాన్కామాన్ ఛన్దతః ప్రార్థయస్వ।*
*ఇమా రామాః సరథాః సతూర్యా న హీదృశా లమ్భనీయా మనుష్యైః॥*

“మానవలోకమున దుర్లభములగు కోరికలన్నియు నీఇష్టము వచ్చినట్లు అనుభవించుటకు కోరుకొనుము. సౌందర్యవతులగు లలనామణులు, రథములు, వాద్యములు మున్నగు దుర్లభములగు కోరికలను కోరుము.”

ఆస్త్రీల పరిచర్యలను గైకొనుచు భోగముల ననుభవింపుము. అంతియేకాని మరణమును గురించి అడుగకుము. అనగా మరణానంతరము ఆత్మ ఉండునా, ఉండదా అని అడుగకుము.

ఇది విని నచికేతుడు ఇట్లనెను:—

*శ్వోభావా మర్త్యస్య యదన్తకైతత్సర్వేన్ద్రియాణాం జరయన్తి తేజః।*
*అపి సర్వం జీవితమల్పమేవ తవైవ వాహాస్తవ నృత్యగీతే॥*

ఓ అంతకా! (సర్వమును నశింపజేయువాడా!) తమరు నేడు ఇచ్చు పదార్థములు, రేపు శరీరశక్తిని నశింపజేయును. బలము క్షీణించినంతనే మరణము నిశ్చయముకదా. కావున జీవితము ఏమి దీర్ఘమైనది కాదు. తమరు ఇచ్చునవి అన్నియు తమకే ఉండుగాక!

*న విత్తేన తర్పణీయో మనుష్యో లప్స్యామహే విత్తమద్రాక్ష్మ చేత్త్వా।*
*జీవిష్యామో యావదీశిష్యసి త్వం వరస్తు మే వరణీయః స ఏవ॥*

మానవుడు విత్తముచే తృప్తినొందడు. తమ దర్శనమాత్రము చేతనే ధనము లభించును. కాని, దానిప్రయోజనమేమి? చిరజీవనము కూడ తమరు ఉన్నంతకాలమే కదా! కావున నాకు మరణానంతర విషయములనుగురించియే తెలుపుడు. అదియే నేనుకోరువరము.

*అజీర్యతామమృతానాముపేత్య జీర్యన్మర్త్యః క్వధఃస్థః ప్రజానన్।*
*అభిధ్యాయన్ వర్ణరతిప్రమోదాన్ అనతిదీర్ఘే జీవితే కో రమేత॥*

బలహీనతను, మృత్యువును పొందని దేవతలచెంతకు జేరిన మానవుడు క్షీణతకును, మృత్యువునకును ఆలవాలమగు సామాన్య సుఖములను ఏల కోరును? అల్పకాలికమగు జీవితమును ఎందుకు ఆశించును?

భోగములను, ఐశ్వర్యములును, మాయాకార్యములు. వాటియందు వివేకరహితమగు దృక్పథమును కలిగియుండుటచే మోహము సంభవించును. మాయాస్వరూపమునుగురించి పారసభాగమున ఇట్లున్నది :—

"మాయ మనుష్యుని అంధునిగా చేయును. మాయాసక్తుడు కాకుండుటకు ఆశ, తృష్ణ- వీనిని తగ్గించవలెను. అంతట హృదయమున పరమేశ్వరునకు సంబంధించిన అనుభవములు కలుగును

వానిచే బుద్ధి ప్రకాశించును. మాయను స్మరించరాదని సంతులు చెప్పిరి."

కావున దేనిని స్మరించరాదో దానిని పొందుటకు ప్రయత్నించువాడు ఎంత అయోగ్యుడు. అట్టి జీవితముచే ఆత్మనిష్ఠ ఎట్లు కలుగును?

'అబుహారేస' అను సంతునకు ఒకమహాత్ముడు చెప్పెను:- "నాతోరమ్ము. నీకు మాయ యొక్క పూర్తిస్వరూపమును చూపించెదను." అని అతనిని ఎముకలు, మలమూత్రములు, చింపిరి గుడ్డలు మొదలగు పదార్థములు ఉన్నచోటికి తీసికొనివెళ్ళి ఇట్లు పలికెను. "నీవు చూచుచున్న ఆపుర్రెలు పూర్వము ఎవరు తృష్ణ, ఈర్ష్యలతో నిండి ఉండిరో వారివి. ఇప్పుడు వారి పుర్రెలు మాత్రమే ఉన్నవి. ఇవికూడ కాలాంతరమున నశించును. మధురముగనుండి, అతిప్రయత్నలభ్యములగు ఆహారపదార్థములు ఈమలరూపమును పొందినవి. ఎన్నియో అమూల్యవస్త్రములు ఇచ్చట చింకిరిగుడ్డలుగా పడి ఉన్నవి. వాహనములకు ఉపయోగించు గుర్రములు, ఏనుగులు ఈ ఎముకలరూపముననే మిగిలి ఉన్నవి. మాయకు ఆరంభమును, అంతమును ఇక్కడనే చూడనగును.

## దైవప్రాప్తికి భోగైశ్వర్యములు నిషిద్ధములు.

'ఇబ్రహీంఆదము' పూర్వము 'బలఖు'నకు రాజు. ఆయన వృద్ధాప్యమునందు సర్వస్వమును త్యజించి పకీరు జీవితమును స్వీకరించెను. ఒకమారు ఆయన రాజభవనమునందలి పైఅంతఃపురమున పరుండియుండెను. ఆయనకు అట్టిసమయమున మెట్లపై నడకచప్పుడు పెద్దది వినవచ్చెను. ఆశబ్దమునకు భవనము కంపించిపోయెను. ఆయన ఉలికిపడి ప్రశ్నించెను- "ఎవరక్కడ?" ఆగంతుకుడు చెప్పెను. "నీ శతృవును కా మిత్రుడను. నా ఒంటె తప్పిపోయినది. వెదకుటకు

ఇక్కడకు వచ్చితిని. ఇబ్రహీము అడిగెను. "ఈపై అంతస్థులో ఒంటెను వెదకుట ఎట్లు?" ఆగంతుకుడు జవాబు చెప్పెను. "ఓ అజ్ఞానీ! నీవు ఇంత గొప్ప రాజభవనములో విలువగల వస్త్రములనుధరించి స్వర్ణసింహాసనముపై కూర్చొని, దేవుని తెలిసికొనగోరుచున్నావు కదా? నీప్రయత్నము రాజభవనములోని పై అంతస్థులో ఒంటెను వెదకుట వంటిదికాదేమో ఆలోచించుకొనుము. నామాటకు నీకు ఆశ్చర్యము ఏల కలిగినది?"

ఇట్లు పలికి ఆగంతుకుడు వెంటనే వెళ్లిపోయెను. అంతట ఇబ్రహీం ఆదము రాజ్యమును, వైభవమును విడనాడి అరణ్యములోనికి వెళ్లిపోయి పకీరుజీవితమును గడపెను.

ఈభోగైశ్వర్యములు రాజులయందే ఉండునని చెప్పవీలు లేదు. అనేకరకములగు భోగములును, ఐశ్వర్యములును శ్రీమంతులకు కూడ లభ్యములు. ఈరోజులలో ధర్మాచార్యులయందును గానవచ్చును. భోగైశ్వర్యములు ఉన్నచోట చిత్తైకాగ్రత అసంభవము. ప్రపంచమును త్యజించి, సన్యాసమును స్వీకరించినవారుకూడ మృష్టాన్నములను భుజించి, మఠాధిపతులయిన భోగులుగనే పరిగణించబడుదురు.

నచికేతునకు యముడు ఇట్లు చెప్పెను:—

*దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా ।*
*విద్యాభీప్సినం నచికేతసం మన్యే న త్వా కామా బహవోఽలోలుపన్త ॥*

"విద్య, అవిద్య—ఈ రెండును పరస్పర విరుద్ధములు. విరుద్ధఫలమును ఇచ్చును. ఓనచికేతుడా, నీవు జ్ఞానమును కోరుచున్నావని తలచుచున్నాను. ఏలనన, విషయేచ్ఛలు నీకు ఆశకల్పించలేదు."

నీవు పూర్ణవివేకవంతుడవు. విషయభోగములలో అనేకులు గొప్పవారు చిక్కుకొనెదరు. వానిని నీవు త్యజించి .

నచికేతుడు వివేకి; విరాగి. కావుననే యముడు ఆతనిని ఆత్మ విద్యను పొందుటకు తగినవానిగా తలచి ఉపదేశించెను. అందుచేతనే భోగైశ్వర్యములు కలవారి మనస్సునకు ఏకాగ్రత కలుగదని భగవానుడు నుడివెను.

బేచరభాయి:—“పరమేశ్వరుడు ఈశరీరమును అనేకభోగములను అనుభవించుటకే నిర్మించెను. మరి ఆభోగములను త్యజించి శరీరమును ఎందుకు కష్టపెట్టవలెను? జ్ఞానము వార్ధక్యమునందు పొందనగును. అందులకు వార్ధక్యమున అరణ్యములోనికి వెళ్ళి యోగాభ్యాసము చేయుట యుక్తము.” అని నేటి యువకులు చెప్పెదరు.

స్వా॥ప్ర॥:—ఒక పిన్నవయస్సుగల జమీందారుడు ఉండెను. ఆతడు 25 గ్రామములకు అధిపతి. అతడు కడు చిన్నవయసునందే యోగము నేర్చుకొనుటకు గురువుచెంతకు వెళ్ళెను. గురువు ఇట్లనెను. యోగము; భోగము రెండును ఒకేమారు జరుగవు. బ్రహ్మానందమను భోగమును అనుభవింపదలచినచో విషయభోగమును విసర్జించవలెను. మనుష్యజన్మము అమూల్యము. స్వర్గమునందలి దేవతలు కూడ మోక్షమును పొందుటకు మానవజన్మమును కోరెదరు. ఈజన్మము చింతామణి వంటిది. ఈశరీరమును తుచ్ఛములగు విషయ భోగములకు అమ్మివేయరాదు.

భర్తృహరిమహారాజు చెప్పెను:—

*భోగః కోఽపి స ఏక ఏవ పరమః*—భోగము అనునది ఒకటే. అది అన్నిటికంటె మించినది. ఇట్లు నచ్చచెప్పి గురువు ఆతనికి యోగమును బోధించెను. అప్పటినుండి ఆజమీందారుడు ఏకాంతమున యోగాభ్యాసము చేయుచుండెను. మిత్రులు ఆతనిని చూచి చెప్పుకొనసాగిరి:—“యోగము వార్ధక్యమున లభించును ఈవయస్సు అందుకు తగినది కాదు.” ఈమాటలు చెవికెక్కి ఆజమీందారుడు యోగాభ్యాసమును విడచి తప్పుత్రోవ త్రొక్కెను.

70 సంవత్సరములు వయస్సు వచ్చు సరికి అతని దేహేంద్రియములు శిథిలము లయ్యెను. అప్పుడు ఆతనికి మరల యోగమును అభ్యసించవలెనను కోరిక కలిగెను. కాని అది జరుగనిపని. అతడు ఎంతయో పశ్చాత్తాపము పొందవలసి వచ్చెను.

## సత్సంగముచే భోగికి పశ్చాత్తాపము.

భోగగ్రస్తుడైన మానవుడు అమూల్యమగు తనశక్తిని వ్యయము చేయును. ఆత్మశక్తిని పొందుటకు ప్రయత్నించడు. అతడు వృద్ధుడైన పిమ్మట సత్సంగముచే పశ్చాత్తాపము నొందును.

జన్మైవ వ్యర్థతాం నీతం భవభోగప్రలోభినా ।
కాచమూల్యేన విక్రీతో హన్త చిన్తామణిర్మయా ॥

సంసార భోగవిలాసములయందు చిక్కుకొనినందున నాజన్మ వ్యర్థమైనది. అయ్యో! చింతామణిని గాజుముక్క ఖరీదునకు అమ్మివేసితిని.

## మనుష్యశరీరము చింతామణివంటిది.

ఒక బీదవానికి దయాశీలుడగు సంతుని దర్శనము కలిగెను. అతడు బీదవాడైనందున జాలికలిగి ఆసంతు ఆతనికి చింతామణి నిచ్చెను. అతడు దానిని తీసికొనెను. కాని ఆప్రకాశవంతమగు పదార్థము ఏమియో అతడు గుర్తించలేకపోయెను. అది ఒక రాయి మాత్రమే అనుకొని అతడు ఒకకూరల దుకాణమునకువెళ్ళి "అన్నా! ఈ ప్రకాశవంతమగు పదార్థమునకు కూర ఇమ్ము"అని అడిగెను. అతనికి ఆరాతికి బదులు ఒక కాణీకూర లభించెను. అది తీసికొని ఆతడు వెళ్ళెను. తరువాత ఒక బంగారు వర్తకుడు ఆవైపునకు వచ్చెను. ఆతడు ఆరాతినిచూచి ఇది సామాన్యపురాయి కాదు, విలువ కలది అనుకొని ఆరాతికి నూరురూపాయలు ఇచ్చెదననెను. అప్పుడు కూరల వర్తకునకు ఆరాతి వెల ఇంకా ఎక్కువ ఉండునని తోచెను. ఆతడు

నూరురూపాయలకు అమ్మినను. బేరముచేసి చివరకు ఆబంగారు వర్తకుడు ఆరాతిని వెయ్యిరూపాయిలకు కొనెను. అనంతరము ఆ బంగారువర్తకుడు ఆరాతిని ఒకవజ్రములవర్తకుని చెంతకు తీసికొని వెళ్ళెను. వజ్రములవర్తకుడు ఆరాతికి ఐదువేల రూపాయిలు ఇచ్చెదనని చెప్పెను. బంగారువర్తకుడు అంగీకరించలేదు. చాలసేపు బేరము చేసిన తరువాత వజ్రములవర్తకుడు చింతామణిని లక్షరూప్యములకు కొనెను. పిదప ఆవజ్రముల వర్తకుడు చింతామణిని రాజుగారికి సమర్పించెను. రాజుగారు సంతోషించి ఆతనికి కోటిరూపాయలనిచ్చిరి. ఈశరీరముకూడ ఆచింతామణి వంటిదే. దీనిని ధరించిన మానవుడు సదుపయోగము చేసినచో ఆత్మతత్త్వమును పొందును. దీని విలువను తెలిసికొననివాడు చింతామణికి బదులుగా కూరాకు తీసికొనిన మూఢునివలె విషయసౌఖ్యములను మాత్రమే పొందును. కావున ఎంత శ్రమపడినను భోగవిలాసములను విడనాడి చిత్తైకాగ్రతను సాధించవలెను. చిత్తైకాగ్రత పొందనంతవరకు సమాధిసుఖము కలుగదు. సమాధిసుఖమును కోరువారు తుచ్ఛమగు విషయసుఖమును త్యజించి చిత్తైకాగ్రతను సాధించవలెను. భర్తృహరి ఇట్లు చెప్పిరి :—

*భోగా భఙ్గురవృత్తయో బహువిధాస్తైరేవ చాయం భవ*
*స్తత్కస్యేవ కృతే పరిభ్రమత రే లోకాః కృతం చేష్టితైః।*
*ఆశాపాశశతోపశాన్తి విశదం చేతః సమాధీయతాం*
*కామోచ్ఛిత్తివశే స్వధామవి యది శ్రద్ధేయమస్మద్వచః॥*

"భోగములు క్షణభంగురములు. ఆ భోగముల మూలముననే ఈ సంసారప్రవృత్తి కలిగినది. నీవు ఏసుఖముకొరకు తిరుగుచున్నావు? అట్లు తిరుగాడుటవలన ప్రయోజనము లేదు. నన్ను నమ్ముచున్నచో వందలు, వేలు సంఖ్యలలో ఉన్న ఆశలనే ఈపాశములను తెంచుకొని కామమును, హరించుటకు తగిన సామర్థ్యమును సంపా

దించుము. స్వయంప్రకాశమగు ఆత్మయందు చిత్తైకాగ్రతను సాధించుము.''

బేచరభాయి:—అభ్యాసదశయందు భోగములు విఘ్నకారకములు. ఆరూఢదశయందు ప్రారబ్ధవశమున భోగేచ్ఛ కలిగినచో నష్టమేమి? విద్యారణ్యులు పంచదశియందు తెల్పిరి:—

*ప్రారబ్ధకర్మప్రాబల్యాత్ భోగేష్విచ్ఛా భవేద్యది।*
*క్లిశ్యన్నేవ తదాప్యేష భుఙ్క్తే విష్టిగృహీతవత్॥*

"ప్రారబ్ధకర్మప్రాబల్యముచే భోగములయందు ఇచ్ఛ కలిగినను జ్ఞాని బలాత్కరింపబడినవాడువలె ఎంతయో బాధపడుచు వానిని అనుభవించును.''

స్వా॥ ప్ర॥:—నేను సన్న్యసించినతరువాత మద్రాసుప్రాంతమునకు వెళ్లితిని. అక్కడ నాపూర్వాశ్రమపరిచితులు గురులింగశాస్త్రియు, వెంకటరాఘవశాస్త్రియు ఉండిరి. అప్పుడు గురులింగశాస్త్రి గీతపై ఏడు సంస్కృతవ్యాఖ్యానములకు తెలుగుచేసి అచ్చువేయించుచుండెను. వెంకటరాఘవశాస్త్రి పంచదశి అనువాదమును ఆంధ్రభాషయందు ముద్రించుచుండెను. నేను గురులింగశాస్త్రివద్దకు వెళ్ళియుంటిని. అక్కడనుండి వెంకటరాఘవశాస్త్రి వద్దకు వెళ్ళవలసియుండెను. గురులింగశాస్త్రి తాను కూడ వచ్చెదననెను. కావున మేమిద్దరము కలసి వేంకటరాఘవశాస్త్రి ఇంటికి వెళ్ళితిమి. మేము వెళ్ళుసమయమున ఇద్దరు బ్రాహ్మణులు వెంకటరాఘవశాస్త్రివద్ద పంచదశి అధ్యయనము చేయుచుండిరి. మరిముగ్గురు, నలుగురు శ్రవణము చేయుచుండిరి. జ్ఞానికిని ప్రారబ్ధమునకును కల సంబంధమును గురించి చర్చించబడుచుండెను. శిష్యులు ఇట్లు సందేహమును వెల్లిబుచ్చిరి:—

వివేకే జాగ్రతి సతి దోషదర్శనలక్షణే।
కథమారబ్ధకర్మాపి భోగేచ్ఛాం జనయిష్యతి॥

"దోషదర్శనాత్మకమగు వివేకము కలిగినప్పుడు ప్రారబ్ధకర్మము భోగేచ్ఛను ఎట్లు కలిగించును?"

గురువులు ఇట్లు సమాధానము చెప్పిరి :—

నైష దోషో యతోఽనేకవిధం ప్రారబ్ధమీక్ష్యతే।
ఇచ్ఛాఽనిచ్ఛా పరేచ్ఛా చ ప్రారబ్ధం త్రివిధం స్మృతమ్॥

"ఈసందేహామునకు స్థానము లేదు. ప్రారబ్ధము ఒకరకము కాదు. ఇచ్ఛ, అనిచ్ఛ, పరేచ్ఛ అని మూడు రకములు."

అపథ్యసేవినః చోరా రాజదారరతా అపి।
జానన్త ఏవ స్వానర్థమిచ్ఛన్త్యారబ్ధకర్మతః॥

"అపథ్యము చేయువాడు, దొంగ, రాజభార్యాసక్తుడు—ఈముగ్గురును అనర్థమును ఎరిగియుండియే ప్రారబ్ధకర్మవశమున అట్లు చేయుదురు."

న చాఽత్రైతద్ వారయితుమీశ్వరేణాపి శక్యతే।
యత ఈశ్వర ఏవాహ గీతాయామర్జునం ప్రతి॥

"ప్రారబ్ధకర్మజన్యమగు ఈ భోగేచ్ఛను ఆపుటకు ఎవనితరము కాదు. కావుననే భగవానుడు అర్జునునితో గీతయందు ఈవిషయము చెప్పెను."

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి।
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి॥

"జ్ఞానికూడ ప్రకృతి ననుసరించి సంచరించును. భూతములు ప్రకృతికి లోబడును. నిగ్రహము ఏమి చేయును?"

ఇట్లు సంభాషణ జరుగుచుండగా శ్రోతలలోనుండి లక్ష్మీనరసయ్య అను వృద్ధబ్రాహ్మణుడు ప్రశ్నించెను;—జ్ఞానమ్ము పొందిన తర్వ

వాతకూడ చౌర్యము, జారత్వము చేయుట ప్రారబ్ధకర్మవశము
అనునది నిజమా?

వెంకట:—జ్ఞాని అట్టిపనులు చేయడు. చేసినను అది అతని దోషము కాదు. అది అతని గొప్పతనమును సూచించును.

అంతట ఆయన గురులింగశాస్త్రి అభిప్రాయమును కోరెను.

గురులింగ:—ప్రతి అంతఃకరణమునందును మల, విక్షేప, ఆవరణ దోషములు అనబడు మూడుదోషములు ఉండును. మలదోషము అనగా పాపములు. పాపములు రెండు రకములు. మహాపాపములు, అల్పపాపములు. మహాపాపములను గురించి మనువు ఇట్లు చెప్పెను.

బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వఙ్గనాగమః।
మహాన్తి పాతకాన్యాహుః సంసర్గశ్చాపి తైః సహ॥

"బ్రహ్మహత్య, సురాపానము, చౌర్యము, గురుపత్నీ సంగమము, ఈపాపములు చేసినవారితో సంసర్గము మహాపాపములు.

బ్రహ్మహత్యా :— విద్వాంసుడు, నైష్ఠికుడు, బ్రహ్మజ్ఞుడు అయిన వానిని చంపుట—అనగా బాధించుట.

సురాపానమ్ :—మద్యపానము మహాపాపము. భంగు, గంజాయి, నల్లమందు మొదలగువానికంటె మద్యము ఎక్కువ మత్తును కలుగజేయును. అందుచే చాలచెడ్డది. అది మనస్సును ఉద్రేకపరచును. దానివలన మానవుడు కర్మకు వశీభూతుడగును. మద్యపానము చేసినవానికి తన చెంతనున్నది తల్లియో, సోదరియో, కూతురో, భార్యయో అను జ్ఞానము ఉండదు. కావున మద్యపానము నిషిద్ధము. అది మహాపాపము. (మద్యపానము అను మాటతో ఉద్రేకమును కలిగించు పదార్థములను అన్నిటిని తెలుపడమైనది.)

స్తేయమ్ :—దొంగతనముగ, తెలియకుండకాని, లేక బలవంతముగకాని ఇతరులసొత్తును తీసికొనుట స్తేయము. ఇచ్చట స్వర్ణస్తేయము మహాపాతకముగా పరిగణింపబడినది,

*గుర్వఙ్గనాగమః*— గురుభార్య అనుమాటతో పెదతండ్రి, మామ, రాజు మొదలగు పెద్దలభార్యలుకూడ ఉద్దేశించబడిరి. వారి సంగమము మహాపాపము.

*సంసర్గశ్చాపి తైః సహ*:—పై మహాపాపులతో సంసర్గము కలిగి యుండుటకూడ మహాపాపమే.

గోవధ, కన్యావిక్రయము, పరస్త్రీసంగమము, మాతాపితృ పరిత్యాగము, శాస్త్రనియమము నతిక్రమించి వడ్డీ తీసికొనుట మొద లగునవి మహాపాతకములకంటె తక్కువ పాపములు. ఈ అల్పపాప ములును, మహాపాపములును రాక్షసస్వభావమునకు చెందినవి. వాటిని చేయకుండ ఆపుటకే వేదములయందు యజ్ఞము, దానము, తపస్సు అను మూడురకములగు కర్మలు నిర్దేశించబడినవి.

విక్షేపదోషము:—అంతఃకరణమునందుండు విషయపదార్థము లను అనుభవించవలెనను కోరిక అనెడు చెడుసంస్కారము. ఇది ఆసురప్రకృతి. విక్షేపదోషనివృత్తికి వేదమునందు ఈశ్వరోపాసనము ప్రతిపాదించబడినది.

ఆవరణదోషము:—తన స్వరూపమును (జీవాత్మస్వరూపము) పరమాత్మస్వరూపమునుగా తెలిసికొనుట యందలి అజ్ఞానము. ఈ అజ్ఞాననివృత్తికి వేదమునందు జ్ఞానము నిర్దేశించబడినది. ఉపనిష ద్భాగము, జ్ఞానకాండ వాని శ్రవణ, మనన, నిదిధ్యాసములచే కలుగు సమాధిద్వారా బ్రహ్మముయొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అపరోక్షజ్ఞాన ప్రాప్త్యనంతరము శుద్ధసత్త్వాంతఃకరణమునందు ప్రారబ్ధవశమున మలవిక్షేపదోషములచే మరల రాక్షస, అసురప్ర వృత్తులు ఽ అసంభవము. ఏలనన, మలవిక్షేపదోషములు ఆగంతుకమ స్వాభావికములు కావు. స్వాభావికము లయినచో వేదమునంద [illegible]సహ వాని నివృత్తికి ఉపాసనాపద్ధతిని నిర్ణయించి

ఉండెడివాడు కాదు. అనేక జన్మల కర్మ అనెడి బీజమునుండి అదృష్టము, వాసన అనెడు రెండు అంకురములు పుట్టును. అదృష్టమునకును స్థూలశరీరమునకును సంబంధము కలదు. అటులనే వాసనకును సూక్ష్మశరీరమునకును సంబంధము కలదు. ప్రారబ్ధము పూర్వజన్మలయందలి పుణ్యపాపములపై ఆధారపడియున్నది. శరీరమునందలి బలము, ఎత్తు, రంగు, కుంటి, గుడ్డి మొదలగువానికి అన్నిటికిని ప్రారబ్ధము కారణము. అవి నివారించ శక్యముకానివి. కాని అంతఃకరణమునందలి రాగద్వేషములు మొదలగు అసుర, రాక్షస ప్రవృత్తులు ప్రారబ్ధజన్యములైనను ఆగంతుకములైనందున నివారించ వీలుపడును. బలవత్తరమగు ప్రారబ్ధముచే అవి కలిగిన వాటిని నివారించుట కూడ అసంభవమే. వానికి జ్ఞానము కలుగుటకు వీలులేదు. విద్యారణ్యులు గీతను ప్రమాణముగా చెప్పిరి. పురుషుడు జ్ఞాని అయినను తన ప్రకృతిని అనుసరించియే పనిచేయును అని. ప్రకృతి అనగా పాపము, భోగము కాదు. మరేమన, అన్నపానాది శారీరకక్రియలు. అవి స్వాభావికములు. బ్రహ్మసూత్రములయందు ("పశ్వాదిభిశ్చావిశేషాత్") అని చెప్పబడినది. అన్నపానాదులయందు జ్ఞానికిని పశ్వాదులకును భేదము ఉండదు. సంస్కృతమున ఒకే శబ్దమునకు అనేక అర్థములు ఉండును. కావున ప్రసంగానుసారము అర్థము చెప్పవలెను. అటులకానిచో భగవానుడే గీత 9వ అధ్యాయమున మరల ఇట్లు చెప్పునా?

*మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః।*
*భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్॥*

ఓ అర్జునా! దైవప్రకృతిని పొందినవారు నన ఎ మరెవ్వరిని
సేవించరు. ప్రాణులకు కారణమును, నాశర కను నేనే అని
నన్నే భజించెదరు. దైవప్రకృతి సహజమైనది. ంతుకము కాదు.

కావుననే "ఆసురీం రాక్షసీం చైవ" అని అసుర, రాక్షసప్రకృతులను దైవప్రకృతిని పొందనుపదేశించబడినది.

లక్ష్మీనరసయ్య :— జ్ఞానికూడ ఇష్టమువచ్చినట్లు సంచరించరాదు అని అద్వైతవివేకప్రకరణమున చెప్పబడినది. ఈశ్లోకములు అందుకు విరుద్ధముగా ఉన్నవి. కావున ఇవి ప్రక్షిప్తములేమో? వాటిని తీసి చూడండి. అంతట గురులింగశాస్త్రి ఈక్రింది శ్లోకములను చదివి వివరించెను :—

*తత్త్వం బుద్ధ్వాపి కామాదీన్ నిశ్శేషం న జహాసి చేత్॥*
*యథేష్టాచరణం తే స్యాత్ కర్మశాస్త్రాతిలఙ్ఘినః॥*

తత్త్వమును తెలిసికొనికూడ కామాదులను పూర్తిగా త్యజించలేకపోయినచో కర్మశాస్త్రోల్లంఘనము జరుగును. అంతట ఇష్టము వచ్చినట్లు మానవుడు సంచరించును.

*బుద్ధ్వాఽద్వైతస్య తత్త్వస్య యథేష్టాచరణం యది।*
*శునాం తత్త్వదృశాం చైవ కో భేదోఽశుచిభక్షణే॥*

అద్వైతమను ఉత్తమతత్త్వమును తెలిసికొని ఇష్టానుసారము సంచరించినచో అశుచిభక్షణమున కుక్కకును ఆ తత్త్వజ్ఞునకును భేదమేమి?

*బోధాత్పురా మనోదోషమాత్రాత్ క్లిశ్నాస్యథాధునా।*
*అశేషలోకనిన్దా చేత్యహో తే బోధవైభవమ్॥*

జ్ఞానప్రాప్తికి పూర్వము కామక్రోధాదులచే నీవు బాధపడితివి. ఇప్పుడు ఇష్టము వచ్చినట్లు సంచరించి ప్రపంచమందరిచేతను తిట్లు తినుచున్నావా! ఏమి తెలివి!

*విడ్వరాహాదితుల్యత్వం మా కాఙ్క్షీస్తత్త్వవిద్భవాన్।*
*సర్వధీదోషసంత్యాగాల్లోకైః పూజ్యస్వ దేవవత్॥*

నీవు తత్త్వజ్ఞుడవు. అయినను కామాదులను త్యజించలేక అధమములగు సూకరాదుల సమత్వమును పొందకుము. కామాది

సంకల్పాత్మకమగు మనస్సునందలి దోషములను త్యజించి దేవుని వలె లోకపూజ్యుడవు అగుము.

కామ్యాదిదోషదృష్ట్యాద్యాః కామాదిత్యాగ హేతవః।
ప్రసిద్ధో మోక్షశాస్త్రేషు తానన్విష్య సుఖీ భవ॥

"కామ్యములయందు దోషమును చూచుట మొదలగునవి కామాదుల త్యాగమునకు కారణములు. అవి మోక్షశాస్త్రముల యందు మిక్కుటముగా కలవు. వానిని శోధించి తెలిసికొని సుఖించుము."

ఇట్లు ద్వైతవివేకప్రకరణమున సిద్ధాంతీకరించి భోగములకు సంబంధించిన విషయము మూడవప్రకరణమున సమర్థించబడినది. కావున ఇవి ప్రక్షిప్తములు కావు.

విజయనగరపు మంత్రిగానున్న వ్యక్తి సన్యాసము స్వీకరించి శృంగేరీమఠమునకు ఆచార్యుడయ్యెను. ఆయనభోగములను సమర్థించినచో ఆశ్చర్యమేమి? గీతయందును,ఉపనిషత్తులందును ఈగోడవ లేదు.

అంతట పంచదశి చదువుచున్న బ్రాహ్మణులు అడిగిరి :— అయితే పంచదశిని త్యజించవలెనా?

గురులింగశాస్త్రి :—పంచదశి అందరును అంగీకరించిన గ్రంథము కాదు. గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు మొదలగునవి సర్వసమ్మతములు. వానిపై ఆధారపడుము. అంతమాత్రముచే పంచదశిని త్యజించ నవసరములేదు. వేదాంతప్రక్రియకు పంచదశి శ్రేష్ఠమైనదే. ఇటువంటి విషయములను మాత్రము గుర్తునందు ఉంచుకొనవలెను. శుష్కవేదాంతులు తమతమ కుకృత్యములను ప్రజలకు నచ్చచెప్పుకొనుటకు శాస్త్రములనుండి ఇట్టి శ్లోకములు ఏరుకొనెదరు. శ్రుతి, స్మృతులయందు వీనికి తగిన ప్రమాణములు ఉండవు. ఏలనన, అవి ఋషిప్రణీతములు. వానిలో నున్నవి సత్యము.

ఇప్పటి విద్వాంసులు వ్రాసినగ్రంథములలో ఇట్టి అసందర్భవిషయములు ఉండును. ఇవి వారి వంకరనడతలను కప్పిపుచ్చుకొనుటకు వ్రాసినవిషయములు. ఇట్టివాని సహాయముచే శుష్కజ్ఞానులు సామాన్యజనులను మభ్యపెట్టెదరు. వారు విశ్వసించెదరు.

అంతట బేచరభాయిని ఉద్దేశించి వినోదార్థము ఇట్లు పలికిరి.

స్వా॥ ప్ర॥ :—విద్వాంసులవద్ద విన్నసంగతి నేను చెప్పితిని. నేను పంచదశి చదువలేదు. నీవు చదివినచో అనేకవిషయములు తెలిసికొనగలవు. నీవు జ్ఞానివి. కావున నీఇష్టము వచ్చిన సుఖమును అనుభవించుము. నేనుమాత్రము అజ్ఞానిని.

## శిలను స్పర్శమణిగా చేయు సంతులు అల్పాహారులు.

అందరును భోజనమునకు లేచిరి. పూరీలు, పిండివంటలు వడ్డించబడెను. అది చూచి ప్రకాశానందులవారు ఇట్లు పలికిరి.

భక్తాగ్రేసరుడగు నామదేవుడు పండరిపురమున ఉండెడివాడు. ఆయన విట్ఠలనాథుని పరమభక్తుడు. ఇంటిలో తినుటకు ఏమి లేకున్న, ఒకటి రెండురోజులు ఉపవాసముచేసిన బాగుండునని అతని ఉద్దేశ్యము. ఆకథ వినుడు.

ఆయన భార్యకును ఒక బ్రాహ్మణస్త్రీకిని స్నేహము. వారిద్దరును ఇట్లు మాట్లాడుకొనిరి :—

"అక్కా, మీవారు అన్నియు సంపాదించి తెచ్చెదరు. నీవు సుఖముగా ఉన్నావు. కాని మావారు ఎప్పుడు చూచినను విట్ఠలనాథుని మందిరమున విట్ఠల్, విట్ఠల్ అని భజన చేయుచునే ఉందురు."

"మావారు ఎక్కడకును వెళ్ళి సంపాదించరు. ఒకానొక సిద్ధపురుషుడు ఆయనకు స్పర్శమణిని ఇచ్చెను. దానిని వేరొకధాతువునకు తగిలించినచో బంగారము అగును, మేము దానితో కుటుంబ

పోషణము చేసికొనుచున్నాము. నీకు కావలసినచో ఆమణిని ఒకమారు ఇచ్చెదను. బంగారము తయారుచేసికొని మరల ఇచ్చివేయుము.

అంతట నామదేవుని సతి ఆమణిని తీసికొని అవసరమైనబంగారమును తయారుచేసికొనెను. దానితో బజారునుండి పదార్థములను కొని తెచ్చి రుచికల పదార్థములను తయారుచేసి వడ్డించెను.

భక్తాగ్రేసరుడైన నామదేవుడు వంటనుండి సూయాగంధము వచ్చుచున్నది ఏమి? అని అనెను.

భార్య:—మీరు స్వయముగా ఏమియు తెచ్చుటలేదు. పైగా నేను ఏదో విధముగా వంటచేసిన తప్పులు పట్టుచున్నారా?

నామదేవుడు:—నీవు చేసినది చేసితివి. ఆసంగతి అటు ఉంచుము. ఇవి అన్నియు ఎట్లు చేసితివో చెప్పుము.

ఇట్లు అనేక పర్యాయములు అడిగినతరువాత భార్య స్పర్శమణి సంగతి చెప్పెను. నామదేవుడు లోలోన కుమిలిపోయెను.

నామ:—"ఇంతవరకు స్పర్శమణి అనునది ఎట్లుండునో నేను చూడలేదు. నాకు ఒకమారు చూపించుము." అనెను.

అంతట ఆమె ఆబ్రాహ్మణవనిత చెంతకు వెళ్లి వెంటనే తిరిగి ఇచ్చివేయుదును అని చెప్పి స్పర్శమణిని తెచ్చి చూపించెను. నామదేవుడు దానిని తీసికొని చంద్రభాగానది వైపునకు పరుగిడెను. భార్య కూడ ఆయనను వెంబడించెను. ఇది చూచిన ప్రజలు కూడ వారి వెంట పడిరి. నామదేవుడు ఆస్పర్శమణిని చంద్రభాగానదిలోనికి విసరివేసెను. బ్రాహ్మణవనితయును, నామదేవుని భార్యయును ఇది చూచి గోడుగోడున ఏడ్వసాగిరి. బ్రాహ్మణుడుకూడ అక్కడకు వచ్చి ఈవిషయమును తెలిసికొనెను. ఆతనికి మతిపోయెను. నామదేవుడు నాప్రాణములను తీసెను అని గోలచేసెను. అందరును నామదేవునకు మతిపోయినది అని నిందించిరి. బ్రాహ్మణుని పరిస్థితిని గమనించి

నామదేవుడు నదిలో మునిగి కొన్ని శిలలను తీసికొనివచ్చి ఇట్లనెను. "ఇవిగో మీ స్పర్శమణులు. మీకు కావలసినన్ని తీసికొనుడు." అందరును ఆచమత్కారమును చూచి ఆశ్చర్యపడిరి. స్పర్శమాత్రము చేత రాళ్ళను స్పర్శమణులుగా మార్చిన మహాత్ముని సాంగత్యముచే చేయలేని పని ఏమి ఉండును? ఇట్లు అనుకొని ఆబ్రాహ్మణుడు నామదేవుని శరణుజొచ్చెను.

భోజనానంతరము నౌకరులు చేతులు కడిగికొనుటకు తువ్వాలు, సబ్బు, నీరు మొదలగునవి తీసికొనివచ్చి నిలబడి ఉండిరి. వారినిచూచి ప్రకాశానందులవారు ఇట్లనిరి:—

కర్ణాటక మహారాజు మొదలగువారు రాజ్యవైభవములను విడనాడి సన్యసించిరి. నావంటి సన్యాసులు ఇట్టి ఆడంబరములను కోరవచ్చునా? కబీరుసాహబు ఇట్లు చెప్పెను:—

*జే రీతి సంతో త్యజే, మూఢ తాహి లలచాయ;*
*నర ఖాయ కరడారే, శ్వాన స్వాద లే ఖాయ.*

"మహాత్ములు వదలివేసినదానిని పొందుటకు మూఢులు ఆసపడెదరు. మనము తిని పారవేసినదానిని కుక్కలు ఆసక్తితో తినును." అందుకనే మహాత్ములు గృహస్థులింట భిక్ష కిష్టపడక మధుకరమును చేసికొందురు.

## స్వామివారి ఉపదేశము.

భుజించిన పిదప స్వామివారు సుఖాసీనులుకాగా బేచరభాయి కులాసాకబుర్లు సాగించెను—"మావద్దకు వచ్చు ఇతర సాధువులందరు సుఖముగా భుజించెదరు. సౌఖ్యములను అనుభవించెదరు. వారివలెనే మమ్ములనుకూడ ఉండమనెదరు. ధనాదులను ఎట్లు సంపాదించినను తప్పు లేదనెదరు. కేవలము వానియందు మమత్వము పనికిరాదని చెప్పెదరు. జ్ఞానమునకు అరణ్యములోనికి వెళ్ళి అభ్యాసము చేయుటవల్ల

సిన అవసరము లేదని కూడ చెప్పెదరు. ఇవి మాఅందరకు నచ్చును. తినరాదు. ధనము సంపాదించరాదు. భోగములను త్యజించవలెను. జ్ఞానమునకు ప్రియత్నించవలెను. అని ప్రకాశానందస్వామివారు చెప్పుచున్నారు. ఇది ఏమి మనకు బాగుండలేదు.''

స్వా॥ ప్ర॥:—నామాటలు మీకు నచ్చవు అని నేను మొదటి నుండియు ఎరుగుదును.

## శ్రోతృ ప క్తృ భే ద ము లు.

కృష్ణార్థీ చ ధనార్థీ చ శ్రోతా వక్తా ద్విధా మతః।
యథా శ్రోతా తథా వక్తా తత్ర సౌఖ్యం వివర్ధతే॥

"దేవుని కోరువాడు, ధనమును కోరువాడు అని శ్రోత, వక్త కూడ రెండు రకములు. శ్రోతనుబట్టి వక్త యున్నచో సుఖము కలుగును.''

కృష్ణార్థీ:— దైవసంపదకలిగి బ్రహ్మసుఖముమాత్రమే ప్రధానమనియు, విషయసుఖము వ్యర్థమనియు తలచి, విషయసుఖమును పరిత్యజించి పరమాత్మను ఉపాసించువాడు కృష్ణార్థి. ఆతడు గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు "సమలోష్టాశ్మ కాఞ్చనః" అనుమాటను అక్షరాల పాటించుచు ద్రవ్యాదులను గ్రహించడు. "యోగక్షేమం వహామ్యహమ్" అని చెప్పినందున భగవంతునిపైన భారము వేసి యుండును. దైవసంపద కలవాడు అల్పసంతోషి. నీతినియమములకు లోబడి ఆతడు స్వల్పముగనే ధనమును ఆర్జించి సంతోషించును.

ధనార్థీ:—అసురసంపద కలవాడు విషయసుఖమే ప్రధానమనియు, మోక్షసుఖము బూటకమనియు తలచును. విషయసుఖమునకు సాధనమగు ధనమును "అన్యాయేనార్థసఞ్చయమ్" అను నీతిని అవలంబించి, ఏదియో ఒకరీతిని ధనమును ఆర్జించును.

"ధర్మ, అర్థ, కామ, మోక్షములు అని పురుషార్థములు నాలుగు. వానిలో అర్థము ముఖ్యము. అర్థము లేనిదే మిగిలిన పురుషార్థములు వ్యర్థములు. మిగిలిన మూడు పురుషార్థములు అర్థములేనిదే జరుగవు. యజ్ఞ, యాగాదులకు అర్థము అవసరము. కావున ఏదియో ఒకరీతిని ధనమును సంపాదింపుడు" అని ఉపదేశించును. అసురసంపద కలశ్రోతలు ఇది విని వ్యాపారములో మోసము చేసియు, ఉద్యోగములో లంచములు మొదలగునవి తీసికొనియు ధనసంపాదనము చేయుదురు. ఆవిధముగా గురుశిష్యులు ఆనందించెదరు. కాని చివరకు వీరందరకు యమధర్మరాజుబహుమతి తప్పదు.

పంజాబులోని అమృతసరనగరమునందు బ్రాహ్మణసంతర్పణము జరుగుచుండెను. అచ్చటనున్న ఒక మహమ్మదీయునకు బ్రాహ్మణులతో సహపంక్తిభోజనము చేయవలెనని కోరిక కలిగెను. పంజాబులోని, హిందూమహమ్మదీయుల దుస్తులు ఒకేవిధముగా నుండును. గడ్డము మొదలగునవి హిందువులకును, మహమ్మదీయులకును కూడ ఉండును. కావున ఆతడు ఫాలమున విభూతిని, చేతిలో చెంబును ధరించి బ్రాహ్మణులతో కూర్చుని భోజనము చేసెను. భోజనానంతరము దక్షిణను ఇచ్చుటకు శాఖాభేదములు చెప్పవలసివచ్చెను. అచ్చట వేర్వేరు శాఖల బ్రాహ్మణులకు వేర్వేరువిధములుగా దక్షిణలను ఇచ్చు ఆచారము ఉండెను.

సారస్వతునకు 0-8-0, ఆదిగౌడునకు 0-6-0, కాన్యకుబ్జునకు 0-4-0, దక్షిణను ఇచ్చుచుండిరి. ఈమహమ్మదీయుడు దక్షిణ తీసికొనుటకు వెళ్ళగనే నీవు ఏశాఖకు చెందినవాడవు అని అడిగెను. అతడు తాను గౌడబ్రాహ్మణుడను అని చెప్పెను. "ఏ గౌడుడవు" అని ప్రశ్నించగా నాతడు సమాధానము చెప్పలేకపోయెను. "ఓ ఖుదా! ఏగౌడుడను!" అని అప్రయత్నముగా అతని నోటినుండి

వెలువడెను. అంతట ఈ మహమ్మదీయుడు బ్రాహ్మణులమధ్య భోజనము చేసెనని తెలిసికొని ఆతనిని కొట్టి తరిమివేసిరి. అట్లు దెబ్బలు తిని అతడు ఇంటికి వచ్చెను. చుట్టుప్రక్కల ఉన్నవారు హిందువుల భోజన మెట్లున్నది అని అడుగ ఆతడు సమాధానము చెప్పెను. "భోజనము బాగుగానే ఉన్నది, కాని దక్షిణమాత్రము చేదుగానున్నది."

ఇటులనే ఇక్కడ ధనార్థియగువానికి యమలోకమున దక్షిణ దొరుకును. యముడు కఠోపనిషత్తులో "పునర్వశమాపద్యతే మే" అని చెప్పెను. ఈ ప్రత్యక్షమృత్యులోకమే సత్యమనియు, పరలోకము అభూతకల్పన అనియు తలచునాస్తికుడగు ధనార్థి అంతమున యమపాశములచే బద్ధుడగును.

నేను నాకు తోచినట్లు వాగుటలేదు. శాస్త్రములలో వ్రాసినదే చెప్పుచున్నాను. ఇది విని నిత్యానందులు ఇట్లనిరి :-రజస్తమో గుణములచే ఆవృతమైన బుద్ధికల శ్రోతకు సత్యాసత్యవివేకము ఉండదు. ఒకదానికి మరియొక అర్థము తీసికొనును.

*సత్యం జనవిరోధాయ అసత్యం జనరఞ్జనమ్।*
*సురా విక్రీయతే స్థానే దధిక్షీరం గృహే గృహే॥*

సత్యము జనులకు నచ్చదు. అసత్యము నచ్చును. కల్లు అమ్ముటకు ప్రత్యేకస్థలము ఉండును. పాలు, పెరుగులు ప్రతి ఇంటను అమ్మబడును.

*సత్యం జనవిరోధాయ*:-ప్రజలకు సత్యము నచ్చదు. ఒకమారు ప్రక్కగ్రామమునుండి నలుగు రైదుగురు వ్యక్తులు కబీరుసాహెబు పేరు విని, ఆయనను గురువుగా స్వీకరించవలెనను తలంపుతో కాశీకి వచ్చి, వారిదర్శనార్థము బయలుదేరిరి. కబీరుసాహెబు క్షౌరము చేయించుకొని చిన్నబట్ట కట్టుకొని స్నానము చే[illegible] గంగాతీర

మునకు వెళ్ళుచుండిరి. వారు క్షౌరము చేయించుకొని వచ్చుచున్న ఒకమనిషి ఎదురగుట చూచి అపశకునమయ్యెనని తలచిరి. వారిలో ఆ క్షౌరముచేయించుకొనిన శిరస్సుపై ఒక్కొక్క చెప్పుదెబ్బ వేసినచో అపశకునదోషము పోవునని సలహా ఇచ్చెను. ఆ సలహా ప్రకారము వారి ప్రక్రియ పూర్తి అగువరకు కబీరుసాహేబు నిలచి ఉండెను. అనంతరము వారు ఆకబీరుసాహాబు ఇల్లు ఎక్కడ అని అడుగుచూ వచ్చిరి. ఆయన బట్టలు నేత నేసికొనుచున్న మహమ్మదీయుల పేటలో నివసించుచుండెను. వారిది చిన్నకుటీరము. అడుగుచూ అడుగుచూ, అక్కడకు వచ్చి ఆ ఆగంతుకులు ఇట్లనిరి. "మహాత్ముడని చెప్పబడు కబీరుసాహేబు ఇల్లు ఇదియేనా?" పొరుగువారు "అవును" అనిరి. "కబీరుసాహేబు లోపల ఉన్నారా?" అని వారు కబీరు సాహేబు భార్యను అడిగిరి.

"లేరు, గంగకు స్నానము చేయుటకు వెళ్ళిరి" అని సమాధానము వచ్చెను. "ఇప్పుడే వచ్చెదరు, కూర్చొనుడు." అని ఆమె చెప్పెను.

"నడచియే వెళ్ళిరా! లేక ఏదైన వాహనముపై వెళ్ళిరా" అని అడిగిరి.

"నడచియే వెళ్ళిరి." అని ఆమె సమాధానము చెప్పెను.

అనంతరము వారు కూర్చొని ఇట్లు సంభాషించిరి :-

"కబీరుసాహేబునకు నివసించుటకు పెద్దభవనము ఉండుననియు, బయటకు వెళ్ళునపుడు పది పదిహేనుమంది కూడ ఉందురనియు, పాలకీలో వెళ్ళెదరనియు తలచితిమి. ఇక్కడ అంతయు దరిద్రము తాండవించుచున్నది." ఇంతలో కబీరు వచ్చెను. ఆవచ్చుచున్న వ్యక్తిని చూచి వారు ఇట్లనుకొనిరి. "మనము వీరినే అపశకునమని తలచి త్రోవలో చెప్పుదెబ్బలు కొట్టితిమి." వారు కబీరుసాహేబు కాళ్ళపైబడి క్షమార్పణ కోరుకొనిరి.

కబీరు ఇట్లనెను :- ఇందులో ఏమి ఉన్నది. మీరు అపకీర్తి నము పోవుటకే కదా కొట్టినది.

అనంతరము వారిని అక్కడ కూర్చుండబెట్టి కబీరు వారికి ఆతిథ్యము ఇచ్చుటకు వలయు సామగ్రిని తెచ్చుటకు బజారునకు వెళ్లెను. పిదప తమలో తాము వారు ఇట్లనుకొనిరి. "మనము ఈయనను గురువుగా స్వీకరించ దలచితిమి. కాని గురువునకు అవసరమైన భవనము, వస్త్రములు, పల్లకి, దండము, చామరము, ఢంకా, నగారా మొదలగు వాద్యములు వీరికి లేవు. గురువునకు ఉండవలసిన లక్షణము లేమియు లేవు." ఇట్లు తలచి వారు అక్కడనుంచి వెళ్లిపోయిరి.

## అసత్యము నచ్చును.

అసత్యం జనరఞ్జనమ్ :— ఒక రాజు ఉండెను. ఆయన తన రాజభవనములో మూడవ అంతస్థులో ఉండెను. రాజకుమార్తె రెండవ అంతస్థులో ఉండెడిది. ఒకరోజున రాజకుమార్తె తన నలుగురు సఖురాండ్రతోను మాట్లాడుచుండెను. రాజు మూడవ అంతస్థునుండి దిగుచుండెను. వారి సంభాషణ విని రాజు మెట్లమీద ఆగి, చాటున ఉండి వారి మాటలు ఆలకించసాగెను.

రా॥ కు॥ :—ప్రపంచములో ఆనందము దేనివలన లభించును?

1 వ సఖి :—మద్యపానముచే లభించును అని నా ఉద్దేశ్యము.

రా॥ కు॥ :— నీవు త్రాగుదువా?

1 వ సఖి :—నేను త్రాగను. నేను బ్రాహ్మణులపిల్లను. మా యింటికి ప్రక్కను ఉన్న జమీందారుడు కల్లు త్రాగుటకు అలవడెను. ఆతడు త్రాగినప్పుడు శరీరముపై బట్ట ఉన్నదో, లేదో, కూడ తెలిసికొనడు. శిథిలతను పొందును. బురదకాలువలో పడినను, తల పగిలినను, గ్రామములో అగౌరవము కలిగినను తెలియదు. ఇట్లు

రెండుమూడు రోజులలో తిరిగి తాగుచుండును. ఇది మద్యపానము వలననే కదా? అందుచేతనే మద్యపానముచే చాల ఆనందము కలుగును అని నేను ఊహించుచున్నాను.

రాజకుమార్తె మరియొక సఖిని ప్రశ్నించెను. ఆమె ఇట్లు సమాధానము చెప్పెను :—

"మాంసభక్షణముచే ఆనందము కలుగును."

రా॥ కు॥ :—నీవు మాంసమును తినెదవా?

2 వ సఖి :— లేదమ్మా. నేను జైనమతస్థురాలను. మా యింటిప్రక్కవారు మాంసము తినెదరు. వారు మాంసమును తిని ఎముకలను పారవేయుదురు. వానిని కుక్కలు తినును. కుక్కలు తినిన తరువాత మిగిలినవానిని కాకులు పొడుచును. కాకులు రుచిచూచిన అనంతరము చీమలు పట్టును. ఎముకలరుచి ఇంతగొప్పది అయినచో మాంసమురుచి ఇంకను ఎంత ఎక్కువగ ఉండునో? కావున మాంసము తినినచో ఆనందము కలుగును అని నా అభిప్రాయము.

అనంతరము రాకుమార్తె మూడవసఖివైపు చూచెను. ఆమె చెప్పెను:—

"విషయసుఖము గొప్పది అని నా ఉద్దేశ్యము."

రా॥ కు॥ :—నీవు విషయసుఖమును అనుభవించితివా?"

3 వ సఖి :—లేదమ్మా. నేను ఇంకను అవివాహితను. నా పొరుగింటి ఆమెకు వివాహము అయినది. ప్రసవసమయమున ఆమె ఇటుపైన భర్తముఖము చూడనని ఒట్టు పెట్టుకొనినది. కాని ఆగ లేదు. సంవత్సరము దాటినదో లేదో తిరిగి ప్రసవసమయము సమీపించినది. కావున విషయసుఖమున ఎంతయో ఆనందము కలదని

అంతట రాజకుమార్తె నాలుగవసఖిని ప్రశ్నించెను. ఆమె దర్బారుగాయకి. "ప్రపంచములో ఎక్కువసుఖము అసత్యమువలన కలుగును." అని జవాబు చెప్పెను.

రా॥ కు॥ :—అది ఎట్లు?

4 వ సఖి :— ఇప్పుడు చెప్పను. ఇప్పుడు మీరు నాకు లక్షా పాతికవేల రూపాయలు ఇచ్చినచో ఒకసంవత్సరము తరువాత సమాధానము చెప్పెదను.

రా॥ కు॥ :—ఇది జరుగనిపని. నాదగ్గర అంతధనము లేదు. నాన్నగారిని అడుగుటకు సిగ్గు. రాకుమార్తె మాటలు విని ఇంతవరకు మాటున ఉన్న రాజు ఎదుటకు వచ్చెను. ఇదిగో ధనము అని ఆగాయకికి ఒకలక్షా ఇరువది అయిదువేలు రూపాయిల ఇచ్చెను. గాయకి ఒక సంవత్సరము సెలవు తీసికొని, ధనమును స్వీకరించి, రెండవ రోజున సారంగి, తబల వాద్యములతో నలుగురు మనుష్యులను తీసికొని దూరదేశమునకు పోయెను. అసలు ఆమె సౌందర్యవతి. కంఠము మధురము. గానవిద్యావిశారద. కావున ఆదూరదేశమున శ్వేతవస్త్రమును కట్టుకొని తులసిమాలను ధరించి వెళ్ళిన ప్రతిగ్రామమునను బలమైన డేరావేసి అపరమీరాబాయివలె అభినయముతో పాటలు పాడుచుండగ, నేత్రములనుండి స్రవించు ఆనందాశ్రువులు ప్రజల హృదయములను ద్రవింపజేయుచుండెను. ప్రజలు "ఆహా! ఎంత పవిత్రహృదయము! ఈమె యథార్థముగా మీరాబాయి అవతారము" అనుటను మొదలుపెట్టిరి.

ఈవిధముగా ఆమె తన బృందముతో అనేకదేశములు సంచరించెను. ఆయా దేశవాసులకు పూజలచేత, భజనలచేత భక్తిభావము వృద్ధినొందించుచు చివరకు భగవద్దర్శనముకూడ చేయింపసాగెను. తన డేరాలో ఒక చెప్పుజోడును వ్రేలాడగట్టి ఉంచెను. భజనానంతర

రము భక్తులను తనతో డేరాలోనికి తీసికొని వెళ్లెడిది. తాను ఆజోడుపైని దృష్టిని నిగిడ్చి భగవద్దర్శన మయినట్లు భావనచేయుచు తన్మయత్వమును చెంది, గద్గదస్వరముతో స్తోత్రము చేసెడిది. పిమ్మట ఆచెప్పుజోడును చూపించి భక్తులతో నిట్లనెడిది-"చూడండి. సాక్షాత్తు శంఖచక్రగదాధరుడగు విష్ణుభగవానుడు భక్తులకు దర్శన మిచ్చుచున్నాడు. అసలు నిక్కచ్చియైన తల్లితండ్రులకు జన్మించినవారికి నిజరూపముతో కాన్పించును. కృత్రిములైన తల్లితండ్రులకు జన్మించినవారికి చెప్పుజోడు ఆకారముతో కాన్పించును." అంతట దర్శనముచేయువా రెల్లరు, తమ తల్లిదండ్రులు కృత్రిములని చెప్పుకొనుట కిష్టపడక, చెప్పుజోడునే చూచుచున్నను, భగవంతుడు నిజరూపముతో దర్శన మిచ్చుచున్నట్లు ఒప్పుకొనుచు, భక్తిభావనతో తన్మయత్వమును నటించుచుండెడివారు. వెలుపలికి వచ్చి "ఆహా! ఏమి మహానుభావురాలు! సాక్షాత్తు ఈమె మీరాబాయి అవతారమే తన ప్రభావముచే భగవానుని చూపించుచున్నదే" అని పలుకుచుండెడివారు. ఇట్లు ఆమెకు గొప్పప్రసిద్ధి దేశదేశముల వ్యాపింప సాగెను.

చుట్టుప్రక్కలనున్న సంస్థానాధీశులు, వారి కుటుంబీకులు అందరు వచ్చి, ఆమెకు ఛత్ర, చామరాది సామగ్రిని సమకూర్చి కొల్చుచుండిరి. ఆమె వైభవము పెరిగిపోయెను. ఆమె పాదపూజలు చేయించుకొని గురుమంత్రమునుకూడ ఉపదేశించుచుండెను. వందలకొలది జనులు ఆమెకు సేవకులయిరి. లక్షలకొలది రూప్యములు ఆర్జించెను.

ఇట్లు అనేకరాజ్యములలో సంచారముచేయుచు ఆమె మొదట తాను బయలుదేరిన రాజ్యమునకు వచ్చెను. రాజుగారు ఆమె మాహాత్మ్యమును విని ఆమెదర్శనము చేసికొనవలెనని తలచెను.

ఎవ్విధముగా ఆమె తనరాజభవనమునకు వచ్చునో తెలిసికొనుటకై ఆమెకు ప్రధానమంత్రిద్వారా నిమంత్రిణపత్రమును పంపెను. దాదాపు సంవత్సరము పూర్తి అగుట చూచుకొని ఆమె రాజుగారి ఆహ్వానమును అంగీకరించెను. రాజు ఆమె సన్మానమునకు తగిన ఏర్పాట్లు చేసెను. భవనమంతయు ఆమెపట్ల వినయమును సూచించునట్లు అలంకరించబడెను. భజనాదుల యనంతరము భగవద్దర్శనమునకు సమయము ఏతెంచెను. అందరికంటె ముందు రాజుగారి వంతు వచ్చెను. ఆయన, తన తల్లిదండ్రులు అపవిత్రులని అనుకొనెదరేమో అను భయముచే చెప్పుజోడును చూచుచు భగవానుని నిజరూపదర్శనము అయినదని ప్రకటించెను. చాల సంతోషించి శ్రీవిష్ణుభగవానుని దర్శనము చేయించి ఎంతయో ఉపకారముచేసినదని ఆమెను స్తుతించెను. ఆమెకు చాలధనము పారితోషికముగా నొసగి రత్నహారాదులతో సత్కరించెను.

రెండవరోజుతో సంవత్సరము పూర్తి అయ్యెను. కావున ఆమె వేషముమార్చి తన నిజవేషముతో రాజభవనములోనికి వెళ్ళెను. రాజు ఆమెను చూచి ఇట్లనెను—"అసత్యమునందే ఆనందము, సుఖము కలదని నిరూపించుటకు నీవు కోరిన గడువు నేటితో పూర్తి అయినది. నీవు ఎట్లు నిరూపించెదవు?"

ఆమె చెప్పెను:—"మహారాజా, ఆవిషయము అట్లుండనిండు. తమరు నిన్న మీరాబాయివద్ద ఎవరి దర్శనముచేసిరి?"

రాజు:—"దేవుని దర్శనము."

ఆమె:—"నిజము చెప్పుడు. దేవుని దర్శనమా? చెప్పుజోడు దర్శనమా?"

రాజు నిర్ఘాంతపోయెను,

అంతట ఆమె రహస్యమును ప్రకటించుచు ఇట్లు చెప్పెను. "మహారాజా, నేనే మీరాబాయి వేషమును ధరించి ఆ ఆడంబరము అంతయు చేసితిని. నామాట నిజమయినది. చెప్పుజోడును చూచి దేవుని చూచితిమని ప్రజలు చెప్పి పరమానందభరితులైరి. అటులనే తమరు కూడ చెప్పి మహానందమును వెల్లడించిరి. కావుననే అసత్యమున ఆనందము కలదని చెప్పితిని."

## జనసమూహపు బుద్ధి రజస్తమో మయము.

*సురా విక్రీయతే స్థానే దధి క్షీరం గృహే గృహే.*—ఇటులనే మద్యము నిషిద్ధపదార్థము అయినందున ఎక్కువ ఖరీదుకు అమ్మబడును. దానిని సేవించుటకు చాలమంది అమ్మేచోటికి వెళ్ళి, త్రాగి మత్తువల్ల ఆనందమును అనుభవించుదురు. అదేవిధముగా పైన చెప్పిన గాయకిని మీరాబాయి అవతారముగా భావించి అసంఖ్యాకులగు ప్రజలు వెళ్ళి, అసత్యపు భగవద్దర్శనానందమును అనుభవించిరి. పాలు, పెరుగు ఉత్తమపదార్థములు అయినను అవి తక్కువ వెలకు అమ్మబడును. అమ్మువారు వాటిని ఇంటింటికి తీసికొనివెళ్లి అమ్మెదరు.

కబీరు పూర్ణజ్ఞాని. దేహాభిమానరహితుడు. ఎవడేమి అనినను లక్ష్యముచేయక ఓర్పుతో సంచరించెడివాడు. కాని అజ్ఞానులు దేహాభిమానపరాయణులయి పైన చెప్పిన మీరాబాయివలె తమ పరువుప్రతిష్ఠలను ఇతరులచే అంగీకరింపజేసికొనుటకు శ్రమపడెదరు.

ప్రపంచమున సూక్ష్మబుద్ధికలవారు కొలది మంది మాత్రమే ఉందురు. చాలమంది సామాన్యులు ఉందురు. కావున సదసద్వివేకము తేలిక కాదు. ఇందు ప్రజలదోషము లేదు. సామాన్యముగా ప్రజలబుద్ధి రజస్తమోగుణవిశిష్టము. కావున సత్యమును తెలిసికొనుట సామాన్యము కాదు. ఇది కలియుగపు ప్రభావము. బృహన్నారద

పురాణమున ఇట్లున్నది– "అధర్మలోలుపాః సర్వే" కలియుగమున అందరును అధర్మమును ప్రేమింతురు. "వ్యాజధర్మరతాస్సర్వే" అందరు ధార్మికులుగా కనిపించుటకు ప్రయత్నించెదరు. "విద్యాగ్రహణశూన్యత్వాదధర్మో వర్తతే పునః" విద్యను గ్రహించుశక్తి లేనందున అధర్మము ప్రచారములో నుండును. ఈకారణములచే వేదశాస్త్రాధ్యయనము జరుగనందున ధర్మాధర్మవిచక్షణ చేయుశక్తి కలుగక జనులు అధర్మప్రవృత్తు లగుదురు.

ఇద్దరు రత్నవర్తకులు ఉండిరి. వారిద్దరికి మిక్కిలి స్నేహము. కాలాంతరమున వారిలో ఒకనికి వ్యాపారములో నష్టము కలిగెను. ఆదెబ్బతో అతడు కొలదికాలములో మరణించెను. పతి మరణించినందున భార్య చాలదుఃఖించెను. రోజు గడచు ఉపాయము లేదు. నగలు అమ్మి రోజులు గడుపుచుండెను. అట్లు 10, 15 సంవత్సరములు గడచెను. కుమారుడు 18 సంవత్సరములవాడాయెను. ఆమె కుమారునికి రెండు వజ్రములు ఇచ్చి తన భర్త స్నేహితుడగు రత్నవర్తకుని చెంతకు ఇట్లని కబురంపె: "ఈ రెండు వజ్రములకు ఖరీదు కట్టి మాకు ధనము నిచ్చిన కొద్దిరోజులు కాలక్షేపము అగును."

కుమారుడు రత్నములను తీసికొనివెళ్ళెను. వర్తకుడు పరీక్షించెను. అవి నకిలీ వజ్రములు. అసలు వజ్రములు కావు. కాని ఆసంగతి పైకి చెప్పలేదు. "వీనిని ప్రస్తుతము మాదగ్గరనే ఉండనిమ్ము. మావద్ద రత్నపరీక్ష నేర్చుకొనుము. ముందుముందు నీకు మేలు కలుగును. నేను నెలకు 25 రూపాయలు ఇచ్చెదను. వానితో నీవు, నీ తల్లియు సుఖముగా కాలము గడుపుకొనుడు."

బాలునకు ఆసంగతి మంచిదిగా తోచెను. తల్లికూడ అది విని సంతోషించెను. అప్పటినుంచి 5, 6 సంవత్సరములలో అతడు రత్నపరీక్షను పూర్తిగా నేర్చుకొనెను. అంతట రత్నవర్తకుడు అతని

దగ్గరనుండి ఆవజ్రములను తెప్పించి పరీక్షించమని ఆతనికి ఇచ్చెను. కుమారుడు పరీక్షించి అవి నకిలీవి అని చెప్పెను.

వర్తకుడు:—"సరిగా చూడుము. నీతండ్రి గొప్ప రత్నవర్తకుడు. అతడు నకిలీ వజ్రములను తనచెంత నుండనివ్వడు."

కుమారుడు అతిజాగ్రత్తగా పరీక్షించి అవి నకిలీవజ్రములే అని చెప్పెను. అంతట వర్తకుడు ఇట్లనెను:—"నీవు నావద్దకు ఈవజ్రములను తీసికొనివచ్చినప్పుడే ఇవి నకిలీవి అని చెప్పినచో మీ అమ్మయు, నీవును ఏమి అనుకొనెదరు? ఇప్పుడు నీవు, పూర్తిగా రత్నపరీక్ష తెలిసినది కనుకనే నీఇంట దాచి ఉంచినవజ్రములు నకిలీవి అని గ్రహించగలిగితివి."

ఇటులనే శాస్త్రజ్ఞానముద్వారా నిజమగు ధర్మము తెలియనంతవరకు తమ అజ్ఞానయుక్తములగు పనులనే ధర్మకార్యములుగా మానవులు తలచెదరు. ధర్మకార్యములను తెలిసికొనుటకు శాస్త్రములు చదువవలెను.

ఇంతలో దర్బారులోనుండి ఒకరు వచ్చి నిత్యానందులవారికి చెప్పిరి:— ప్రకాశానందస్వామివారు జూనాగఢ్ వెళ్ళవలసి ఉన్నది. వారివద్ద కప్పుకొనుటకు చినిగిన బొంతమాత్రము కలదు. ఇది చలికాలము. కావున అంతఃపురములోనుండి విలువైన రజాయి పంపినారు.

## ఆశకలవాడు దరిద్రుడు.

ఈమాటలు విని నిత్యానందులవారు ఇట్లు చెప్పిరి.

అరణ్యములో ఒక మహాత్ముడు బొంత కప్పుకొని ఉండెను. దానికి పెద్దపెద్ద చిరుగులు ఉండెను. ఒక రాజుగారు ఆసమయమున పెద్దసైన్యముతో ఆమార్గముననే వెళ్ళుచుండిరి. వారు ఈమహాత్ముని చూచిరి. కప్పుకొనుటకు సరియైన బట్ట లేకుండుట చూచి వజ్రవైడూర్యములతో అలంకరించబడిన తన శాలువను తీసికొని రమ్మని

సిపాయిని ఆజ్ఞాపించెను. సిపాయి శాలువ తెచ్చి ఆమహాత్మునిచెంత నుంచెను. "ఒరే, ఇదిగోరా, నీరోజు పండినది. మా మహారాజుగారు నీయందు దయగలిగి రెండుమూడు లక్షల రూపాయిలు విలువకల శాలువను బహుమతిగా ఇచ్చిరి.

మహాత్ముడు :— దరిద్రునకు ఎవనికైన ఇమ్ము.

సిపాయి :- ఓరి సన్యాసీ, నీకేమైన మతి పోయినదా ఏమి?

ఆమహాత్ముడు మాత్రము శాలువ తీసికొనలేదు. అంతట సిపాయి రాజువద్దకు వెళ్ళి ఆసన్యాసి వెర్రివానివలె ఉన్నాడు. శాలువ తీసికొనుట లేదు. దరిద్రున కిమ్మని చెప్పుచున్నాడు అనెను.

"ఈయన దరిద్రుడనియే కదా శాలువ ఇచ్చుచున్నాను" అనుకొని ఆయనచెంతకు మహారాజు వచ్చి అడిగెను.

"స్వామీ, చలి చాలవేయుచున్నది. మీవద్ద ఏమియు లేదు. ఈ శాలువ కప్పుకొనుడు" అని చెప్పెను.

మహాత్ముడు :— దరిద్రున కెవనికైన ఇమ్ము.

మహారాజు :—దరిద్రుడనగా ఎవరు?

మహాత్ముడు :—నువ్వు ఎవరవు ?

మహారాజు :—నేను ఈ దేశపు రాజును.

మహాత్ముడు :—నీవు ఎక్కడకు వెళ్ళుచున్నావు?

మహారాజు:—యుద్ధముచేయుటకు వెళ్ళుచున్నాను.

మహాత్ముడు:—యుద్ధము చేయవలసిన కారణము ఏమి?

మహారాజు:—రాజ్యము పెంచుటకు.

మహాత్ముడు:—నీ ఆదాయము ఎంత?

మహారాజు:—మూడు కోట్లు.

మహాత్ముడు:—ఇంకను నీ ఆశ తీరలేదా? నీవు యుద్ధములో జయించి తీరెదవను నమ్మకము ఏది? నీవే యుద్ధములో చని పోయినచో......

భర్తృహరి మహారాజు ఇట్లు చెప్పిరి :—

వయమిహ పరితుష్టా వల్కలైస్త్వం చ లక్ష్మ్యా
సమ ఇహ పరితోషో నిర్విశేషో విశేషః ।
స తు భవతు దరిద్రో యస్య తృష్ణా విశాలా
మనసి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః ॥

"మాకు ఈ నారబట్టలవలన కలుగు సంతోషమే మీకు లక్ష్మివలన కలుగును. సంతోషము ఉభయత్ర సమానము. భేదము ఏమియు లేదు. పేరాశ కలవాడే దరిద్రుడు. మనస్సునకు సంతోషము కలిగినచో దరిద్రు డెవడు? ధనవంతు డెవడు?"

ఇట్లు ఆ మహాత్ముడు రాజును దరిద్రుడుగా నిరూపించెను. అంతట ఆరాజు సైన్యమును వెనుకకు పంపి ఆమహాత్ముని సాంగత్యమున కొంతకాలము ఉండి, ఉపదేశములను స్వీకరించి వెనుకకు మరలెను.

మంచిచెడ్డలు మనదృష్టినిపట్టి ఉండును. వీరికి చలి సోకకుండ చేసికొనుటయే కావలసినది. మురికిదియో, చినిగినదియో, ఏదియో ఒకటి. అదే స్వామివారికి గొప్పది.

అంతట ప్రకాశానందులవారిని జూనాగఢ్ పంపుటకు వీడ్కోలు ఏర్పాట్లు జరిగెను.